


నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
EVENING EDITION
4PM
www.suryaa.com పేజీలు: 02

| | |
|---|---|
| బంగారం ధర 10 GRMS 24 CARAT | ₹63,820 |
| వెండి ధర 1KG | 80,000 |
| సెన్సెక్స్ (325 ↓) | 71,568 |
| నిఫ్టి (83 ↓) | 21,583 |
| చికెన్ ధర 1KG | ₹210 |
| గుడ్ల ధరలు డజన్ | ₹70 |



## నేడు జగన్ ఇంటికి షర్మిల.. ఆ తర్వాత ఢిల్లీకి

### కుమారుడి వివాహానికి ఆహ్వానం

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఇంట ఈ రోజు ఆసక్తికర పరిణామాలు జరగబోతున్నాయి.. కుటుంబ సమేతంగా సీఎం జగన్ నివాసానికి వెళ్లనున్నారు వైఎస్ఆర్‌టీపీ చీఫ్ వైఎస్ షర్మిల.. తాడేపల్లిలోని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ క్యాంప్ కార్యాలయానికి వెళ్లనున్న షర్మిల.. తన సోదరుడు, ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను కలవనున్నారు.. తన కుమారుడు రాజారెడ్డి, ప్రియా అట్లూరితో వివాహ నిశ్చితార్థంతో పాటు పెళ్లి వేడుకకు సంబంధించిన ఆహ్వాన పత్రికను జగన్‌కు అందజేయనున్నారు.. తన ఇంట్లో జరిగే తొలి శుభకార్యానికి హాజరుకావాలని అన్నకు ఆహ్వానం పలకనున్నారు.. అయితే, గత కొన్నేళ్లుగా అన్నా – చెల్లెళ్ల మధ్య గ్యాప్ పెరుగుతూ వస్తుందనే వార్తలు వచ్చాయి.. చివరకు వైఎస్ ఘాట్‌లో నివాళులర్పించే సమయంలోనూ ఇద్దరు విడివిడిగా వెళ్లడం కూడా హాట్ టాపిక్ అయ్యింది.. ఇప్పుడు షర్మిల.. తన అన్నయ్య దగ్గరకు వెళ్తుండడంతో.. ఈ పరిణామాలను ఆసక్తికరంగా గమనిస్తున్నారు ప్రజలు.

# దూసుకుపోతున్న అదానీ షేర్లు



అదానీ గ్రూప్ (అదానీ గ్రూప్ స్టాక్స్) షేర్లు బుధవారం ప్రారంభ ట్రేడింగ్‌లో గొప్ప వృద్ధిని కనబరుస్తున్నాయి. సుప్రీం కోర్టు కీలక నిర్ణయానికి ముందు గ్రూప్‌లోని అన్ని షేర్ల ధరలు పెరిగాయి. అదానీకి చెందిన పలు షేర్ల ధరలు ప్రారంభ ట్రేడింగ్‌లో 10 నుంచి 16 శాతం వరకు పెరిగాయి.

**ఈ షేర్ల ధరల్లో అత్యధిక పెరుగుదల**

అదానీ గ్రూప్‌లోని మొత్తం 10 షేర్లు ఈరోజు ట్రేడింగ్‌ను లాభాలతో ప్రారంభించాయి. అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ ప్రారంభ సెషన్‌లో అత్యధికంగా 16శాతం లాభపడింది. అదానీ టోటల్ గ్యాస్, ఎన్‌డిటివి వంటి షేర్లు కూడా ఒక్కొక్కటి 10 శాతం పెరుగుదలను చూస్తున్నాయి. అదానీ విల్మార్, అదానీ గ్రీన్ ధరలు 7 నుండి 8 శాతం వరకు బలంగా ఉన్నాయి. అదానీ గ్రూప్ ఫ్లాగ్‌షిప్ షేర్ అదానీ ఎంటర్‌ప్రైజెస్ కూడా ప్రారంభ ట్రేడ్‌లో 7 శాతానికి పైగా పెరిగింది. అదానీ పోర్ట్స్ ధరలో దాదాపు 6 శాతం పెరుగుదల ఉంది. అదానీ పవర్ దాదాపు 5 శాతం బలంగా ఉంది. గ్రూప్‌కు చెందిన రెండు సిమెంట్ స్టాక్స్, ఏసీసీ, అంబుజా సిమెంట్ ధరలు కూడా 3శాతం చొప్పున పెరిగాయి. అదానీ గ్రూప్ షేర్లలో ఈ అద్భుతమైన పెరుగుదల వెనుక సుప్రీం కోర్టు నిర్ణయమే కారణం. దాదాపు ఏడాది నాటి హిండెన్‌బర్గ్ కేసులో సుప్రీంకోర్టు తీర్పు వెలువరించింది. అమెరికన్ షార్ట్ సెల్లర్ సంస్థ హిండెన్‌బర్గ్ రీసెర్చ్ గతేడాది జనవరిలో అదానీ గ్రూప్‌పై పలు సంచలన ఆరోపణలు చేసింది. గత ఏడాది జనవరిలో హిండెన్‌బర్గ్ నివేదిక అదానీకి భారీ ఎదురుదెబ్బ తగిలింది. నివేదిక వచ్చిన తర్వాత, గ్రూప్‌లోని అన్ని షేర్లు భారీగా పడిపోవడం ప్రారంభించాయి. చాలా మంది ధరలు సగానికి పైగా తగ్గాయి.నవంబర్ 24న నిర్ణయం రిజర్వ్ చేయబడింది

హిండెన్‌బర్గ్ ఆరోపణలు దేశంలో రాజకీయ రంగు పులుముకున్నాయి. ఆ తర్వాత హిండెన్‌బర్గ్ ఆరోపణలకు సంబంధించి మార్కెట్ రెగ్యులేటర్ అదానీ గ్రూప్‌పై దర్యాప్తు ప్రారంభించింది. సుప్రీంకోర్టు స్వయంగా దర్యాప్తును పర్యవేక్షిస్తోంది. ఇదే విచారణకు సంబంధించి అనేక పిటిషన్లు దాఖలయ్యాయి. దీనిపై నేడు సుప్రీంకోర్టు తీర్పు వెలువడనుంది. అంతకుముందు, ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం నవంబర్ 24న నిర్ణయాన్ని రిజర్వ్ చేసింది.



## శిథిలాల కింద మృతదేహాలు..

### 62కు చేరిన జపాన్ భూకంప మరణాలు

జపాన్‌లో భూకంపం ధాటికి మృతుల సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. ఇప్పటి వరకు 62 మంది మృతులను గుర్తించినట్లు అధికారులు వెల్లడించారు. భవన శిథిలాలను తొలగిస్తున్న కొద్దీ ఈ సంఖ్య మరింత పెరగొచ్చని తెలిపారు. జపాన్‌లో జనవరి 1న రిక్టర్ స్కేల్‌పై 7.6 తీవ్రతతో వచ్చిన భూకంపానికి ఇషికావా ప్రిఫెక్చర్ అతలాకుతలమైన విషయం తెలిసిందే. ముఖ్యంగా నోటో ద్వీపకల్పం తీవ్రంగా ప్రభావితమైంది. వేలాది భవనాలు కుప్పకూలాయి. మరికొన్ని ఇళ్లు మంటల్లో దగ్ధమయ్యాయి. ఈ ఘటనల్లో 62 మంది మృతి చెందడంతోపాటు మరో 300 మంది తీవ్రంగా గాయపడినట్లు అధికారులు తెలిపారు. వీరిలో 20 మంది పరిస్థితి విషమంగా ఉందన్నారు. దాదాపు 32 వేల మంది నిరాశ్రయులుగా మారారని.. వారంతా పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం పొందుతున్నట్లు తెలిపారు. తీర ప్రాంతంలోని సుజు పట్టణంలో దాదాపు 90 శాతం ఇళ్లు ధ్వంసమైనట్లు మేయర్ మషురో ఇజుమియా తెలిపారు. ఇప్పటికీ చాలా మంది సాయం కోసం వేచిచూస్తున్నారని స్వయంగా జపాన్ ప్రధానమంత్రి ఫుమియో కిషిదా బుధవారం తెలిపారు. వారందరినీ ఆదుకునేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సహా స్థానిక యంత్రాంగాలన్నీ క్షేత్రస్థాయిలో ముమ్మరంగా సహాయక కార్యక్రమాల్లో నిమగ్నమైనట్లు వెల్లడించారు. ప్రజల ప్రాణాలను కాపాడటమే తమ తొలి ప్రాధాన్యమన్నారు. మరోవైపు, జపాన్‌లో బుధవారం భారీ వర్షం పడే అవకాశం ఉన్నట్లు వాతావరణ కేంద్రం హెచ్చరించింది. కొండచరియలు విరిగిపడే అవకాశం ఉందని ప్రజలను అప్రమత్తం చేసింది.



## పార్లమెంట్ ఎన్నికలపై బీజేపీ స్పెషల్ ఫోకస్

### 10 సీట్లు టార్గెట్‌గా వ్యూహం..

తెలంగాణలో పార్లమెంట్ ఎన్నికలకు ప్రిపేర్ అవుతున్నాయి ప్రధాన పార్టీలు. ముఖ్యంగా పార్లమెంట్ ఎన్నికలను ప్రెస్టేజియస్‌గా తీసుకుంది బీజేపీ. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలతో ఉత్సాహంలో ఉన్న బీజేపీ లోక్‌సభ స్థానాల్లో విజయం సాధించేలా వ్యూహాలు రచిస్తోంది. గతంలో జరిగిన లోపాలు అధిగమించి 17 ఎంపీ స్థానాల్లో 10టార్గెట్ గా పావులు కదుపుతుంది బీజేపీ. దీని కోసం గ్రౌండ్ లెవల్‌లో వర్క్ స్టార్ట్ చేసింది. అంతేకాదు.. ఉత్తర తెలంగాణాలో పార్టీకి పట్టు చిక్కడం.. మంచి ఫలితాలు రావడంతో ముందస్తుగా ప్రణాళికలు సిద్ధం చేస్తుంది బీజేపీ. క్యాండిడేట్ ఎంపికతో పాటు.. క్యాడర్ సమాయత్తం చేస్తూ దూకుడుగా వ్యవహరిస్తుంది బీజేపీ. వీలైనంత త్వరగా అభ్యర్థులను ప్రకటించాలని అంతకంటే ముందే ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టాలని కమలదళం నిర్దేశించుకుంది. కేంద్ర పథకాల లబ్ధిదారుల జాబితా ఆధారంగా ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలిసేందుకు మరో ప్రణాళిక సిద్ధంచేస్తోంది. కీలక అంశాలపై దృష్టిపెట్టిన టీబీజేపీ.. ఎన్నికల కార్యాచరణలో భాగంగా కీలకాంశాలపై బీజేపీ దృష్టిసారించింది. లాస్ట్ టైం పార్లమెంట్ ఎన్నికల్లో 4సీట్లను ఈసారి 10కి పెంచాలని యోచిస్తుంది. అటు కేంద్ర బీజేపీ నేతలు సైతం తెలంగాణ పార్టీ పరిస్థితిని నిషితంగా గమనిస్తున్నారు. మొన్నటికి మొన్నే హైదరాబాద్ లో పర్యటించిన కేంద్రహోంమంత్రి అమిత్ షా పార్టీ యాక్టివిటీని అడిగి తెలుసుకున్నారు. అసెంబ్లీ ఫలితాలతో సంబంధం లేకుండా ముందుకెళ్లాలని పార్టీ నేతలకు సూచించారు. హైదరాబాద్ వేదికగా అమిత్ షా నాయకత్వంలో జరిగిన పార్లమెంట్ ప్రిపరేషన్ మీటింగ్ లో మండల స్థాయి నుండి రాష్ట్ర స్థాయి నాయకులు పాల్గొన్నారు. కేంద్రంలో హ్యాట్రిక్ సాధించాలంటే ప్రతి సీటు కూడా సీరియస్ గా తీసుకోవాలని కేడర్‌కు దిశానిర్దేశం చేశారు అమిత్ షా. ఈ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలను క్యాడర్ తో చర్చించారు. దశలవారీగా ప్రచార కార్యక్రమాలు ముందుకు తీసుకెళ్లాలని.. ప్రతి ఓటరును చేరుకునేలా పార్టీ అనుబంధ విభాగాలకు లక్ష్యాన్ని నిర్దేశించారు.



## మరోసారి ఈడీ విచారణకు కేజ్రీవాల్ గైర్హాజరు..

మద్యం కుంభకోణం కేసులో విచారణకు హాజరు కావడం లేదని ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ బుధవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌కు సమాచారం ఇచ్చారు. ఆ నోటీసులు అక్రమమని, కేజ్రీవాల్‌ను అరెస్టు చేసే ఉద్దేశంతోనే వాటిని ఇచ్చారని ఆప్ ఆరోపించింది. కేజ్రీవాల్‌కు ఇప్పటివరకు మూడుసార్లు ఈడీ నోటీసులు ఇచ్చింది. ఈ రోజు ఆయన విచారణకు హాజరుకావాల్సి ఉంది. కానీ.. తాను రావడం లేదని ఈడీకి ముఖ్యమంత్రి సమాచారం ఇచ్చారు. ఈ మేరకు ఆప్ స్పందించింది. 'దర్యాప్తు సంస్థకు సహకరించడానికి కేజ్రీవాల్ సిద్ధంగా ఉన్నారు. ఎన్నికలు సమీపిస్తోన్న తరుణంలో ఈ నోటీసులు ఎందుకు పంపారు..? ఎన్నికల్లో ప్రచారం చేయకుండా అడ్డుకునే ప్రయత్నం ఇది. ఆయన్ను అరెస్టు చేసే ఉద్దేశం కనిపిస్తోంది' అని పార్టీ ఆరోపించింది. కాగా, మద్యం కుంభకోణం కేసులో ఇప్పటికే సీబీఐ.. కేజ్రీవాల్‌ను విచారించిన విషయం తెలిసిందే. గత ఏడాది ఏప్రిల్‌లో ఆయనను 9 గంటల పాటు ప్రశ్నించింది. అనంతరం ఈడీ నుంచి సమన్లు వచ్చాయి. ఇదిలా ఉండగా.. ఈ కేసులో గత ఫిబ్రవరిలో ఢిల్లీ మాజీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోదియా అరెస్టయ్యారు. ఆప్ ఎంపీ సంజయ్ సింగ్‌ను అదుపులోకి తీసుకున్నారు.



## కాలి బూడిదైన సీఎంఆర్ షాపింగ్ మాల్..

హైదరాబాద్‌లోని ఉప్పల్‌లో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. సీఎంఆర్ షాపింగ్ మాల్‌లో మంగళవారం రాత్రి ప్రమాదవశాత్తు మంటలు చెలరేగాయి. కొద్ది సమయంలోనే మంటలు భారీగా చెలరేగడంతో షాపింగ్ మాల్ మొత్తం మంటలు వ్యాపించాయి. షాప్ మొత్తం కాలిబూడిదైంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. నాలుగు ఫైరింజన్లతో సిబ్బంది మంటలార్పారు. షాప్ క్లోజ్ చేశాక ప్రమాదం జరగడంతో ప్రాణనష్టం తప్పింది. అయితే ఆస్తి నష్టం భారీగానే జరిగినట్లు పేర్కొంటున్నారు. భారీగా వస్తువులు కాలి బూడిదైనట్లు పేర్కొంటున్నారు. అయితే, ప్రమాదానికి గల కారణాలను అధికారులు తెలుసుకుంటున్నారు. కోట్లరూపాయల్లో ఆస్తినష్టం ఉంటుందని అంచనా వేశారు. ప్రమాదానికి షార్ట్ సర్క్యూటా, వేరే కారణాలేవైనా ఉన్నాయా అన్న కోణంలో దర్యాప్తు ప్రారంభించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు.. మాల్ సీసీఫుటేజీని సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. ఈ ఘటన హైదరాబాద్ నగరంలో కలకలం రేపింది. రద్దీ సమయంలో అగ్ని ప్రమాదం జరిగితే.. భారీగా ప్రాణ నష్టం జరిగేదని.. షాపు మూసివేసిన తర్వాత జరగడం వల్ల ప్రాణ నష్టం తప్పిందని పోలీసులు తెలిపారు. యజమానులు ఫైర్ సేఫ్టీపై దృష్టిసారించాలని కోరుతున్నారు.

## సమ్మె విరమించిన పెట్రోల్ బంకుల దగ్గర కొనసాగుతున్న రద్దీ




ట్రక్, ఆయిల్ ట్యాంకర్ల డ్రైవర్లు రెండు రోజుల పాటూ సమ్మె చేశారు. దీంతో రవాణా ఎక్కడిక్కడ ఆగిపోయింది. నిన్న సాయంత్రం సమ్మె కాల్ ఆఫ్ చేసినా వేరే ప్రాంతాల నుంకచి రావల్సిన బళ్ళు ఇప్పటికీ చేరుకోలేదు. దీంతో నిత్యావసర సరుకులు, పెట్రోల్ , డీజిల్ లేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. దీంతో పెట్రోల్ బంకుల దగ్గర రద్దీ కొనసాగుతోంది. ఇవాళ కూడా ట్యాంకర్లు బంకులకు చేరుకునేందుకు ఆలస్యమయ్యే అవకాశం ఉందని చెబుతున్నారు. కొన్ని పెట్రోల్ బంకులు నో స్టాక్ బోర్డులు పెట్టేవాయి. మిగతా వాటి దగ్గర భారీగా క్యూలు కట్టి నిల్చున్నారు జనాలు. దీంతో ఎక్కడిక్కడ ట్రాఫిక్ విపరీతంగా జామ్ అయిపోతోంది. నిన్న సాయంత్రం హైదరాబాద్‌లో ట్రాఫిక్ కష్టాలతో చాలా మంది ఒళ్ళు ఆలస్యంగా చేరుకున్నారు. ఈరోజు కూడా ఉదయాన్నే ఆఫీసులకు వెళ్తున్న వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇది ఒక్క హైదరాబాద్‌లోనే కాదు దాదాపు దేశం మొత్తం ఇదే పరిస్థితి కొనసాగుతోంది. మహారాష్ట్ర, గుజరాత్, మధ్య ప్రదేశ్, బిహార్, రాజస్థాన్, హిమాచల్‌ప్రదేశ్, పంజాబ్, హరియాణాల్లో ట్రక్కు డ్రైవర్లు పెద్దఎత్తున రాస్తారోకోలు, భారీ ర్యాలీలు చేపట్టారు. దీంతో పెద్దసంఖ్యలో ట్రక్కులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. మహారాష్ట్రలో పెట్రోలియం ఉత్పత్తుల రవాణా దాదాపు నిలిచిపోయింది. కొన్ని ప్రాంతాల్లో ఎల్పీజీ సిలెండర్ల సరఫరాకు ఆటంకం ఏర్పడింది. మోటారు వాహనాల చట్టం సవరణను నిరసిస్తూ తెలంగాణలో పెట్రోల్, ఆపిల్ ట్యాంకర్ల యజమానులు చేపట్టిన ధర్నాను విరమించారు. ఇండియన్ పీనల్ కోడ్‌ను మారుస్తూ కొత్త న్యాయసంహిత అనే చట్టాన్ని అమలులోకి తీసుకొస్తున్నామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. దీని తాలూకా బిల్లు కూడా పార్లమెంటులో ఆమోదం పొందింది. అయితే ఇప్పుడు ఇందులో నిబంధనలు కొన్ని తమకు వ్యతిరేకంగా ఉన్నాయంటూ ట్రక్ యజమానులు, డైవర్లు ఆందోళనకు దిగారు.



## ప్రజాపాలన దరఖాస్తులకు గడువు పెంపు లేదు

రాష్ట్రంలో ఈ నెల ఆరో తేదీ వరకే ప్రజాపాలన దరఖాస్తుల కార్యక్రమం కొనసాగుతుందని రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ప్రజా పాలన దరఖాస్తులు సమర్పించేందుకు గ్రామాల్లో నిర్వహిస్తున్న శిబిరాల గడువు పొడిగింపు ఉండదని ఆయన స్పష్టం చేశారు. ఈ నెల 6 తర్వాత మండల కేంద్రాల్లో యథావిధిగా అర్జీలు సమర్పించవచ్చని చెప్పారు. మంగళవారం సచివాలయంలో పొన్నం ప్రభాకర్ విలేకరులతో మాట్లాడారు. "భారాస, భాజపాలకు మధ్య అవగాహన ఉందన్న విషయం అందరికీ తెలుసు.. కేసీఆర్ స్క్రిప్ట్‌ను కిషన్‌రెడ్డి, ఇతర భాజపా నేతలు చదువుతున్నారు. కేసీఆర్‌ను రక్షించేందుకు భాజపా మేడిగడ్డపై సీబీఐ విచారణ జరిపించడం లేదు. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగిందని ఢిల్లీ నుంచి గల్లీ వరకు తెలుసు.. దీనిపై సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణకు ఇప్పటికే ఆదేశించాం.



## సెబీకి సుప్రీం కీలక ఆదేశాలు

అదానీ-హిండెన్‌బర్గ్ కేసులో సుప్రీంకోర్టు సెబీకి కీలక ఆదేశాలు ఇచ్చింది. ఈ అంశంలో పెండింగ్‌లో ఉన్న 24కేసుల్లో రెండు కేసుల దర్యాప్తును మూడు నెలల్లోగా పూర్తి చేయాలని ధర్మాసనం పేర్కొంది. అనంతరం రెగ్యులేటరీ ఫ్రేమ్‌వర్క్‌ను బలపరచడంలో కోర్టు నియమించిన నిపుణుల ప్యానెల్ చేసే సిఫార్సులను సెబీ, కేంద్ర ప్రభుత్వం పరిగణించాలని న్యాయస్థానం తెలిపింది.



## బ్లూ డ్రెస్ లో కృతి శెట్టి మైండ్ బ్లోయింగ్ ఫోజులు

డెబ్యూ చిత్రంతోనే కృతి శెట్టి కుర్రాళ్లకి క్రష్ గా మారింది. వైష్ణవ్ తేజ్ తో కలసి కృతి శెట్టి ఉప్పెన చిత్రంతో ఇండస్ట్రీకి పరిచయం అందింది. ఉప్పెన మూవీ బాక్సాఫీస్ వద్ద తిరుగులేని విజయం దక్కించుకున్న సంగతి తెలిసిందే.డెబ్యూ చిత్రంతోనే కృతి శెట్టి కుర్రాళ్లకి క్రష్ గా మారింది. వైష్ణవ్ తేజ్ తో కలసి కృతి శెట్టి ఉప్పెన చిత్రంతో ఇండస్ట్రీకి పరిచయం అందింది. ఉప్పెన మూవీ బాక్సాఫీస్ వద్ద తిరుగులేని విజయం దక్కించుకున్న సంగతి తెలిసిందే. అంతా ఊహించనట్లుగానే కృతి శెట్టి టాలీవుడ్ లో క్రేజీ హీరోయిన్ గా మారిపోయింది. ఈ చిత్రం తర్వాత కృతి శెట్టికి అవకాశాలు వెల్లువలా వచ్చాయి. తర్వాత ఆమెకి వచ్చిన ఆఫర్స్ చూసి తప్పకుండా టాప్ లీక్ హీరోయిన్ అవుతుందని అంచనా వేశారు.  కానీ కృతి శెట్టిని దురదృష్టం వెంటాడుతోంది.గ్లామర్ పరంగా ఇప్పటికీ కృతి శెట్టి యువతకి ఫేవరిట్ బ్యూటీనే అని చెప్పాలి.



## హైదరాబాద్ మెట్రో కొత్త రూట్స్ ఇవే..

దారుల్ షిఫా జంక్షన్ నుంచి షాలిబండ వరకు గల మెట్రోరైల్ స్ట్రెచ్ మార్గాన్ని రోడ్డును వెడల్పు చేయాలన్న హెచ్ఎంఆర్ఎల్ చేసిన ప్రతిపాదనలపై పాతస్తీ ప్రజా ప్రతినిధులతో సంప్రదించి దారుల్ పిషా జంక్షన్ నుండి ఫలక్ నుమా జంక్షన్ వరకు రహదారిని 100 ఫీట్ల వరకు విస్తరించే సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని అధికారులకు సీఎం సూచించారు. ఈ మార్గాలకు సంబంధించిన ప్రణాళికలు త్వరగా సిద్ధం చేసి సెంట్రల్ అర్బన్ డెవలప్ మెంట్ అండ్ హౌసింగ్ మినిస్టర్ హర్దీప్ సింగ్ పూరికి డ్రాఫ్టు లెటర్‌ను సిద్ధం చేసి పంపించాలని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్ మెంట్ ముఖ్య కార్యదర్శితో పాటు మెట్రోరైలు ఎండీని ముఖ్యమంత్రి ఆదేశించారు. 40 కిలోమేటర్ల మేర మూసి రివర్ ఫ్రంట్ ఈస్ట్-వెస్ట్ కారిడార్‌ను మెట్రో రైలు ప్రాజెక్టులో చేర్చాలని సూచించారు. తారామతి నుంచి నార్సంగి వయా నాగోల్ , వయా ఎంజీబీఎస్ చేపట్టాలని కోరారు. ఇక కొత్త మెట్రో రూట్స్ విషయానికొస్తే.. మియాపూర్-చందానగర్-బీహెచ్ఈఎల్-పటాన్ చెరు(14 కిలోమీటర్లు), ఎంజీబీఎస్-ఫలక్ నుమా-చాంద్రాయణగుట్ట-మైలాదేవర్ పల్లి-పీ7 రోడ్డు-ఏయిర్ పోర్టు(23 కిలోమీటర్లు), నాగోల్-ఎల్బీనగర్-ఓవైసీ హాస్పటల్-చాంద్రాయణ గుట్ట-మైలాదేవర్ పల్లి-ఆరాంఘర్-న్యూ హైకోర్టు ప్రతిపాదిత ప్రాంతం రాజేంద్రనగర్(19 కిలోమీటర్లు), కారిడార్ 3లో భాగంగా రాయదుర్గం నుంచి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వరకు (విప్రో జంక్షన్ నుండి/అమెరికన్ కాన్సులేట్) వయా బయోడైవర్సిటీ జంక్షన్, ట్రిపుల్ ఐటీ జంక్షన్, ఐఎస్ బీ రోడ్డు(12 కిలోమీటర్లు), ఎల్బీనగర్-వనస్థలిపురం-హయత్ నగర్(8 కిలోమీటర్లు)గా ఉంది. ఏయిర్ పోర్టు మెట్రోకు సంబంధించి మార్చిన అలైన్ మెంట్ ప్రకారం వయా ఓల్డ్ సిటీ , ఎల్బీనగర్ కు సంబంధించిన ట్రాఫిక్ అధ్యయనం చేయడం తోపాటు డీపీఆర్ త్వరగా సిద్ధం చేయాలని హెచ్ ఎంఆర్ ఎల్ ఎండీకి సీఎం సూచించారు. లక్ష్మిగూడ-జల్ పల్లి -మామిడిపల్లి మార్గంలో కొత్తగా మెట్రో నిర్మాణం కోసం అవకాశాలను పరిశీలించాలని సూచించారు. ఎటువంటి ఆటంకాలు లేకుండా రోడ్డు మధ్యలో 40 ఫీట్ల వెడల్పుతో నిర్మాణం చేసే ప్రణాళికను పరిశీలించాలని సూచించారు.




## పవర్ఫుల్ గా "హను మాన్" నుంచి శ్రీ రామదూత స్తోత్రం.!

రానున్న సంక్రాంతి కానుకగా టాలీవుడ్ సినిమా నుంచి వస్తున్నా పలు అవైటెడ్ చిత్రాల్లో దర్శకుడు ప్రశాంత్ వర్మ అలాగే యంగ్ హీరో తేజ సజ్జల కాంబినేషన్ నుంచి వస్తున్నా మరో చిత్రం "హను మాన్" కూడా రాబోతుంది. మరి మంచి అంచనాలు ఉన్న ఈ చిత్రం విషయంలో మేకర్స్ ఇప్పడు వరుస ప్రమోషన్స్ ని చేస్తుండగా పలు ఆసక్తికర అప్డేట్స్ ని కూడా తాము ఇస్తున్నారు. ఇక ఈ సాలిడ్ చిత్రం నుంచి మేకర్స్ ఇపుడు మరో పవర్ఫుల్ సాంగ్ ని అయితే రిలీజ్ చేశారు. శ్రీ రామదూత స్తోత్రం అంటూ రిలీజ్ చేసిన ఈ సాంగ్ అద్భుతమైన విజువల్స్ తో రామ ఆంజనేయ భక్తులని మెప్పించే విధంగా ఉందని చెప్పాలి. మెయిన్ గా గౌర హరీష్ ఇచ్చిన మ్యూజిక్ ఆ రిథమ్ కానీ చాలా బావున్నాయి. అలాగే ఈ సాంగ్ లో శ్రీచరణ్ భాస్కరుణి వోకల్స్ కూడా పర్ఫెక్ట్ గా సెట్ అయ్యాయి. మొత్తానికి అయితే మేకర్స్ హను మాన్ ఫ్యాక్టర్ తో డివోషనల్ గా సాలిడ్ ట్రీట్ ని ఇవ్వడానికి సిద్ధం అవుతున్నారని చెప్పాలి.



## నారింజ పండ్లతో వెళ్తున్న లారీ బోల్తా.. పండ్ల కోసం ఎగబడ్డ జనం

ఆదిలాబాద్ కుప్టిలో రోడ్డు ప్రమాదం జరిగింది. లారీ అదుపుతప్పి బోల్తా పడిపోయింది. నారింజ పండ్లతో వెళ్తున్న లారీ బోల్తాపడటంతో పండ్లన్నీ రోడ్డుపై పడిపోయాయి. గమనించిన స్థానికులు పరుగు పరుగున వచ్చారు. రోడ్డుపై పడిపోయిన నారింజ పండ్లను తీసుకెళ్లేందుకు స్థానికులు ఎగబడ్డారు. సంచులు, గోతాంలు తీసుకొచ్చి పండ్లను నింపుకుని తీసుకెళ్లారు. లారీ బోల్తా పడటంతో పండ్లన్ని ఇలా రోడ్డు పాలయ్యాయి. నాగ్‌పూర్ నుంచి హైదరాబాద్ వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది.

## ఘోర రోడ్డు ప్రమాదంలో 14 మంది మృతి.. 27 మందికి తీవ్ర గాయాలు



అసోంలోని గోలాఘాట్ జిల్లాలో బుధవారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ప్రయాణీకుల బస్సుతో వెళ్తున్న బస్సును ట్రక్కు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఐదుగురు మహిళలు, ఒక మైనర్ బాలుడు సహా దాదాపు 14 మంది మరణించినట్లు అధికారులు తెలిపారు. మరో 27 మంది తీవ్రంగా గాయపడ్డారు. జాతీయ రహదారి 37లోని డెర్గావ్ వద్ద తెల్లవారుజామున 5 గంటలకు ఈ సంఘటన జరిగింది. సుమారు 45 మందితో గోలాఘాట్ నుంచి టిన్సుకియా వైపు వెళుతున్న బస్సును, అదే మార్గంలో ఎదురుగా వస్తున్న బొగ్గు లోడుతో వస్తున్న ట్రక్కును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రెండు వాహనాల డ్రైవర్లు అక్కడికక్కడే మృతి చెందగా, గాయపడిన వారిని దేర్గావ్ సివిల్ ఆసుపత్రికి తరలించారు. తీవ్ర గాయాలపాలైన వారిని జోర్హాట్ మెడికల్ కాలేజీ అండ్ హాస్పిటల్ (జేఎంసిహెచ్)కి తరలించారు. కాగా జాతీయ రహదారికి ఒకవైపు రోడ్డు మరమ్మతులు జరుగుతున్నాయి. అందుకే రెండు వైపుల నుంచి వచ్చే వాహనాలు డివైడర్‌కి ఒకవైపు నుంచే వెళ్తున్నాయి. ఈ క్రమంలో అతి వేగంతో వస్తున్న ట్రక్కు బస్సును ఢీకొట్టిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారని గోలాఘాట్ డిప్యూటీ కమిషనర్ పి ఉదయ్ ప్రవీణ్ తెలిపారు. బస్సులోని ప్రయాణికుల్లో ఎక్కువ మంది బరలుఖువా గ్రామానికి చెందినవారున్నారు. టిన్సుకియాలోని తిలింగ ఆలయానికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. బస్సు, ట్రక్కు నుంచి 12 మృతదేహాలను స్వాధీనం చేసుకున్నామని, గాయపడిన 27 మందిని జెఎంసిహెచ్‌కి తరలించగా, ఇద్దరు చికిత్స పొందుతూ మృతి చెందారు. ట్రక్ డ్రైవర్ నిర్లక్ష్యడ్రైవింగ్ కారణంగా ప్రమాదం జరిగినట్లుకేసు నమోదు చేసుకున్నామని, దర్యాప్తు ప్రారంభించామని గోలాఘాట్ పోలీసు సూపరింటెండెంట్ రాజేన్ సింగ్ మీడియాకు తెలిపారు.



## గ్రాడ్యుయేషన్ విద్యార్థులకు 'కెరీర్ టూల్ కిట్'

గ్రాడ్యుయేషన్ విద్యార్థుల కోసం రూపొందించిన 'కెరీర్ టూల్ కిట్' పోర్టల్‌ను మంగళవారం మంత్రి బొత్స సత్యనారాయణ ప్రారంభించారు. డిగ్రీ, బీటెక్‌లో చేరిన విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ ఇచ్చేందుకు ఈ పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చారు. విద్యార్థులు ప్రవేశాలు పొందినప్పటి నుంచి కోర్సు పూర్తయ్యే నాటికి ఉద్యోగాలు పొందేందుకు నేర్చుకోవాల్సిన కోర్సులు, నైపుణ్యాల వివరాలను ఈ పోర్టల్‌లో పొందుపరిచారు.



## అదిరిపోయిన సైంధవ్ ట్రైలర్

మన టాలీవుడ్ మోస్ట్ లవబుల్ సీనియర్ హీరో విక్టరీ వెంకటేష్ హీరోగా దర్శకుడు శైలేష్ కొలను తెరకెక్కించిన అవైటెడ్ సాలిడ్ ప్రాజెక్ట్ "సైంధవ్". మరి వెంకీ మామ కెరీర్ లో బెంచ్ మార్క్ చిత్రం 75వ సినిమాగా దీనిని ప్లాన్ చేయగా మేకర్స్ ఈ సినిమా పట్ల సూపర్ కాన్ఫిడెన్స్ గా అయితే ఉన్నారు. ఇక ఈ ప్రాజెక్ట్ నుంచి ఇప్పుడు చిత్ర యూనిట్ ట్రైలర్ ని రిలీజ్ చేశారు. మరి ఈ ట్రైలర్ మాత్రం అదిరే లెవెల్లో ఉందని చెప్పాలి. దర్శకుడు శైలేష్ సినిమా లైన్ మొత్తాన్ని ట్రైలర్ లోనే చూపించేసాడు కానీ సైంధవ్ పాత్రపై ఉన్న ఎమోషన్ ని దాని తాలుకా వెయిట్ ని దర్శకుడు క్యారీ చేసిన విధానం మాత్రం సాలిడ్ గా ఉందని చెప్పాలి. ఇక మెయిన్ గా ఆ విజువల్స్ అన్నీ చాలా రిచ్ గా కనిపిస్తుండగా యాక్షన్ బ్లాక్ లు అయితే మరో లెవెల్లో ఉన్నాయి.

## కాంగ్రెస్‌లోకి షర్మిల.. స్పందించిన వైవీ



YSRTP అధ్యక్షురాలు వైఎస్ షర్మిల కాంగ్రెస్‌లో చేరడంపై వైసీపీ నేత వైవీ సుబ్బారెడ్డి స్పందించారు.  ఆయన మీడియాతో మాట్లాడుతూ.. "షర్మిళ మూడేళ్ల క్రితం తెలంగాణలో పార్టీ పెట్టారు. ఈ మధ్య కాంగ్రెస్‌లో చేరుతున్నారని కూడా వార్తలు వస్తున్నాయి. దానిపై మాకు క్లారిటీ లేదు. షర్మిల కాంగ్రెస్ నుండి ప్రచారం చేసినా మాకు ఎలాంటి ఇబ్బంది ఉండదు. ఎందుకంటే.. మాకు ప్రజా మద్దతు ఉంది." అని ఆయన వ్యాఖ్యానించారు.




## బాలయ్య 109పై లేటెస్ట్ అప్డేట్.!

నందమూరి నటసింహం నందమూరి బాలకృష్ణ హీరోగా ప్రస్తుతం దర్శకుడు కొల్లి బాబీ తో తన కెరీర్ 109వ సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. మరి ఈ చిత్రం బాలయ్య వరుసగా హ్యాట్రిక్ బ్లాక్ బస్టర్ హిట్స్ అందుకున్న తర్వాత వస్తున్నది కావడంతో భారీ హైప్ నెలకొనగా ఇంట్రెస్టింగ్ గా ఈ చిత్రాన్ని మేకర్స్ ఆ మూడు సినిమాల కంటే చాలా పవర్ ఫుల్ గా ప్రెజెంట్ చేశారు. దీనితో ఈ సినిమాపై అంచనాలు మరింత ఎక్కువ అయ్యాయి. ఇక ఈ చిత్రం షూటింగ్ ని మేకర్స్ శర వేగంగా కంప్లీట్ చేస్తుండగా ఇప్పుడు షూట్ పై లేటెస్ట్ అప్డేట్ తెలుస్తుంది. దీని ప్రకారం మేకర్స్ రీసెంట్ గానే రంపచోడవరం అలాగే మారేడుమిల్లి ప్రాంతంలో షూటింగ్ ని స్టార్ట్ చేసినట్టు తెలుస్తుంది. అలాగే మెయిన్ లీడ్ పై కొన్ని కీలక సన్నివేశాలను ఇక్కడ తెరకెక్కిస్తున్నారట. మరి ఈ షెడ్యూల్ వారం పాటుగా కొనసాగుతుంది అని తెలుస్తుంది. మరి ఈ చిత్రాన్ని బాబీ ఎలా షేప్ అవుట్ చేస్తున్నాడో చూడాలి.



## దీక్షల విరమణ ప్రారంభం.. ఇంద్రకీలాద్రికి పోటెత్తిన భవానీలు

నగరంలోని ఇంద్రకీలాద్రిపై భవానీ దీక్షల విరమణ క్రతువు ప్రారంభమైంది. పెద్ద ఎత్తున భవానీలు కనక దుర్గమ్మ సన్నిధికి తరలి వస్తున్నారు. దీంతో ఆలయ పరిసరాల్లో రద్దీ నెలకొంది. భవానీలు గిరిప్రదక్షిణ చేసి వినాయకుడి గుడి నుంచి దర్శనం క్యూలైన్లో ప్రవేశించేందుకు వీలుగా అధికారులు ఏర్పాట్లు చేశారు. భవానీలు ఇరుముడిని అమ్మవారికి సమర్పించిన అనంతరం మల్లేశ్వరాలయం మెట్ల మార్గం ద్వారా మల్లికార్జున మహామండప ప్రాంగణానికి చేరుకుంటారు. ఆ తర్వాత హోమగుండాల్లో నేతి కొబ్బరికాయను సమర్పించి గురుస్వామి వద్ద మాల తీయడంతో దీక్ష విరమణ ప్రక్రియ పూర్తవుతుంది. ఈ నెల ఏడో తేదీ వరకు నిర్వహించే ఈ కార్యక్రమానికి సుమారు 5 లక్షల మంది దీక్షాధారులు తరలివస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు.